క్లుప్తంగా

23న సంగీత విభావరి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ మనోహర్, మహ్మద్ ఖాన్ తదితరులు

డాబాగార్డెన్స్ : అందాల నటుడు కమల్ హాసన్ నటించిన చిత్ర గీతాలతో ఈ నెల 23న ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'ఆకాశమే నీ హద్దురా' పేరిట సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు గీత్ – సంగీత్ సంస్థ అధినేత, ప్రముఖ గాయకుడు మహ్మద్ ఖాన్ తెలిపారు. ఈ మేరకు గురువారం సంస్థ కార్యాలయంలో సినీ సంగీత విభావరి పోస్టర్‌ను ప్రముఖ డెంటిస్ట్ డాక్టర్ మనోహర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆ రోజు సాయంత్రం 5.30 గంటల నుంచి నిర్వహించనున్న సంగీత విభావరికి కమల్ హాసన్ అభిమానులు, సంగీత ప్రియులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో కోరుకొండ రంగారావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో 'జన్‌జాతీయ గౌరవ్ దివస్'



సెమినార్‌లో పాల్గొన్న అతిథులు

అల్లిపురం: గిరిజన స్వాతంత్ర్య పోరాటాలు దేశ చరిత్రలో ఒక ముఖ్యమైన అధ్యాయమని ఎస్టీ వెల్ఫేర్ అండ్ ఎంపవర్‌మెంట్ అధికారి ఎం.ఎ స్.అఖిల అన్నారు. సౌత్ జైలురోడ్డులోని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఇగ్నో ఆధ్వర్యంలో గురువారం జన్‌జాతీయ గౌరవ్ దివస్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'ట్రైబల్ రివోల్ట్స్ ఎగైనెస్ట్ బ్రిటీష్ రూల్' అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ వి.సూర్యనారాయణ, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల, ఇగ్నో డైరెక్టర్ డాక్టర్ ధర్మారావు ఘణాపాటి పాల్గొన్నారు.

కుల గణనతోనే సామాజిక న్యాయం

సీతంపేట : దేశంలో కుల గణనతోనే సామాజిక న్యాయం సాధ్యమని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్ అన్నారు. రామాటాకీస్ రోడ్‌లో గల అంబేడ్కర్ భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 23న ఉదయం 10 గంటలకు కులగణన – సామాజిక న్యాయం అంశంపై అంబేడ్కర్ భవన్‌లో సదస్సు నిర్వహించనున్నట్టు తెలిపారు. కుల గణన అంటే కేవలం సంఖ్యాపరమైన లెక్కలు మాత్రమే కాదని, ఆయా సామాజిక వర్గాల ఆర్థిక, సామాజిక, విద్యాపరమైన అంశాలన్నీ అందులో ఉంటాయన్నారు. దీని ద్వారా స్వాతంత్ర్యం వచ్చాక ఆయా సామాజిక వర్గాల్లో ఏ స్థాయిలో అభివృద్ధి జరిగిందో స్పష్టత లభిస్తుందన్నారు. పలువురు ప్రముఖులు హాజరై ప్రసంగిస్తారని, సదస్సును విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఇందుకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అనాథ శవాన్ని తరలిస్తున్న సంస్థ సభ్యులు, హెడ్ కానిస్టేబుల్ రాంబాబు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం రైల్వేస్టేషన్ ప్రధాన రహదారిలో భిక్షాటన చేసుకునే మహిళ గురువారం మరణించడంతో స్థానిక అవర్ హేండ్స్ సంస్థ ప్రతినిధి పిల్లి గోవిందరాజు ఐదో పట్టణ పోలీసుల సహకారంతో అంత్యక్రియలు నిర్వహించారు. స్థానిక నాయకులు ఐతి రవి, ఐతి మధు సహకారంతో మృతదేహాన్ని అంతిమ యాత్ర వాహనంలో కాన్వెంటు కూడలిలో గల శ్మశాన వాటికకు తరలించి అంత్యక్రియలు పూర్తి చేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాంబాబు, సంస్థ ప్రతినిధులు నరసింహ, రాజు పాల్గొన్నారు.



పెద్దలు, పిల్లల కోసం వివిధ రకాల జర్కిన్లు



పోలీస్ బ్యారెక్స్ వద్ద ఉన్ని దుస్తుల దుకాణాలు

చలికాలంలో వెచ్చని నేస్తం

- ఉన్ని దుస్తులకు పెరిగిన గిరాకీ
- పోలీస్ బ్యారెక్స్ కేంద్రంగా జోరుగా విక్రయాలు
- పెరుగుతున్న చలిగాలుల నుంచి రక్షణ



చిన్నారులకు ఆకర్షణీయమైన టోపీలు



మహిళల కోసం వివిధ రకాల స్వెటర్లు

జగదాంబ: చలికాలం వచ్చిందంటే చాలు గజగజ వణికించే చలిని తట్టుకునేందుకు ఉన్ని వస్త్రాలు అందరూ ధరించాల్సిందే. ఇప్పటి వరకు ఎండ, ఉక్కపోతతో ఇబ్బంది పడిన ప్రజలు శీతాకాలపు చల్లటి గాలులతో సేదతీరుతున్నారు. ఇదే సమయంలో రాత్రి వేళ్లలో ఉష్ణోగ్రతలు తగ్గిపోయి క్రమంగా మంచు కురవడంతో ఉన్ని దుస్తుల అవసరం పెరిగింది. వాతావరణం మారి చలి పెరగడంతో వెచ్చని స్వెటర్లకు డిమాండ్ పెరిగింది. పోలీస్ బ్యారెక్స్ వద్ద గల వెచ్చని ఉన్ని దుస్తుల దుకాణాల వద్ద కొనుగోళ్లు జోరందుకున్నాయి. బ్యారెక్స్‌తో పాటు జాతీయ రహదారిని ఆనుకుని, మరిన్ని ప్రధాన జంక్షన్ల వద్ద ఉన్ని వస్త్రాలు దుకాణాలు వెలిశాయి. ఏటా బ్యారెక్స్ వద్ద టిబెట్, ఒడిశా, నేపాల్ నుంచి ఉన్ని వస్త్ర వ్యాపారులు మూడు నెలల పాటు మకాం వేసి వివిధ రకాల ఉలెన్ దుస్తులు విక్రయిస్తుంటారు.

నాణ్యమైన వస్త్రాలు

మధ్యతరగతి నుంచి సాధారణ ప్రజలకు పోలీస్ బ్యారెక్స్ వద్ద అందుబాటులో ఉన్ని వస్త్రాలు లభ్యమవుతున్నాయి. పెద్దలు, మహిళలు, పిల్లల కోసం ఉలెన్ జర్కిన్లు, మంకీ టోపీలు, స్వెటర్లు, శాలువాలు, మఫ్లేర్లు వంటి అనేక రకాల నాణ్యమైన ఉన్ని దుస్తులు విక్రయిస్తున్నారు. రూ.300 నుంచి రూ.3 వేల వరకు ధరల్లో లభిస్తున్నాయి.

వ్యాపారం బాగుంది



ఈ ఏడాది ఉన్ని దుస్తుల వ్యాపారం బాగుంది. గత రెండేళ్లు ఇబ్బందులు పడ్డాం. జనవరి వరకు వ్యాపారం మరింత బాగుంటుందని భావిస్తున్నాం. నగర ప్రజల అభిరుచి మేరకు అన్ని రకాల ఉన్ని వస్త్రాలను అందుబాటు ధరలో విక్రయిస్తున్నాం.

– టాష్ దవా, నేపాల్, ఉన్ని దుస్తుల వ్యాపారి

పిల్లలతో సహా వస్తాం



ఏటా విశాఖలో ఉన్ని వస్త్రాలను విక్రయించేందుకు టిబెట్ నుంచి పిల్లలతో సహా వస్తుంటాం. మూడు నెలలు ఇక్కడే ఉండి వ్యాపారాలు చేసుకుంటాం. విశాఖ ప్రజలు ఎప్పుడూ ఆదరిస్తారు.

– టాష్ జుర్‌మే, టిబెట్, వ్యాపారి

15 ఏళ్లుగా విక్రయిస్తున్నాం



విశాఖలోని పోలీస్ బ్యారెక్స్ వద్ద 15 ఏళ్లుగా ఉన్ని వస్త్రాలు విక్రయిస్తున్నాం. నగర ప్రజలకు పరిచయస్తులం. షోరూమ్స్‌తో పోలిస్తే మా వద్ద ధరలు తక్కువగా ఉంటాయి. అందుకే ప్రజలందరూ బ్యారెక్స్ వద్దకు వచ్చి స్వెటర్లు కొనుగోలు చేస్తుంటారు.

– జాకీ, ఒడిశా, వ్యాపారి

మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

- అఖిలభారత మత్స్య కార్మిక సంఘం జాతీయ అధ్యక్షుడు జేవీఎస్



పతాకం ఆవిష్కరిస్తున్న జేవీ సత్యనారాయణమూర్తి

అల్లిపురం : ప్రభుత్వం మత్స్యకారులను ఆదుకోవాలని అఖిల భారత మత్స్య కార్మిక సంఘం జాతీయ అధ్యక్షుడు జేవీ సత్యనారాయణ మూర్తి డిమాండ్ చేశారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా ఏపీ రాష్ట్ర మత్స్యకార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం అల్లిపురం మహాత్మాగాంధీ మార్కెట్ వద్ద ఆయన పతాకం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ భారతదేశంలో మత్స్య సంపద కూడా వ్యవసాయ రంగంతో ముడిపడి ఉందన్నారు. అందులో భాగంగా దేశానికి, రాష్ట్రానికి మత్స్య సంపద వల్ల సంపద చేకూరుతుందన్నారు. దురదృష్టవశాత్తు దేశ పాలకుల విధానాల వల్ల వేటకు వెళ్లి మత్స్యకారులు అనేక కష్టనష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వాలు పారిశ్రామికవేత్తలకు ఊడిగం చేస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఏపీ రాష్ట్ర మత్స్యకార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వాసుపల్లి నల్లనయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్యుతం, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నెయ్యల నాగభూషణం, విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.పోతయ్య, గరికిన లక్ష్మణరావు, కూడా వజ్రం, చీకటి గురుమూర్తి, పల్లేటి పార్వతి, కె.పార్వతి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



కనక మహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సంపద దోపిడీకి ప్రభుత్వం యత్నం



మాట్లాడుతున్న రవీంద్రభరత్

డాబాగార్డెన్స్ : కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా ప్రజల సంపద దోపిడీకి ప్రయత్నిస్తోందని కళింగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సనపల రవీంద్ర భరత్ ఆరోపించారు. సంపద సృష్టిస్తామని మాయ మాటలు చెప్పి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ దిశగా కార్యాచరణ చేపట్టలేదన్నారు. ఆయన కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడారు. సంపద సృష్టించడమంటే ప్రజల సంపద దోచుకోవడమా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో నిత్యావసర సరకుల ధరలు, విద్యుత్ చార్జీలు విపరీతంగా పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తగా విశాఖపట్నంలోని బీచ్‌లోకి ప్రవేశ టిక్కెట్ల ప్రతిపాదన దారుణమన్నారు. రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజలు ఇప్పటికే ఇబ్బందులు పడతున్నారని, ఇటువంటి పరిస్థితుల్లో జిల్లాల ఇన్నర్ రోడ్లలో కూడా టోల్ వసూలు ప్రతిపాదన ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

తల్లిదండ్రులకు బాలిక అప్పగింత

అల్లిపురం: తప్పిపోయిన బాలికను రక్షించిన మహారాణిపేట పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. సీఐ బాసు భాస్కరరావు తెలిపిన వివరాలిలా.. కోడిపందాల వీధికి చెందిన ఏడేళ్ల బాలిక హాసిని బుధవారం తన తల్లితో కలిసి బయటకు వచ్చింది. తరువాత తల్లితో విడిపోవడంతో దారి తప్పిపోయింది. రాత్రి కేజీహెచ్ దరి ఒక దుకాణం యజమానురాలికి బాలిక ఏడుస్తూ కనిపించడంతో ఆమె చేరదీసింది. మహారాణిపేట పోలీసులకు సమాచారం అందజేయడంతో వారు పాప తల్లిదండ్రులను గురువారం పిలిపించి అప్పగించారు. దీంతో వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

- ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మిస్సింగ్ కేసులో 15 ఏళ్ల బాలుడు కుటుంబ సభ్యుల నుంచి తప్పిపోగా 24 గంటల్లో ఆచూకీ గుర్తించారు. కుటుంబ సభ్యులకు బాలుడిని పోలీసులు అప్పగించారు.

నవజాత శిశువుల మరణాలు తగ్గించేందుకు చర్యలు



మాట్లాడుతున్న కేజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రాధాకృష్ణ

మహారాణిపేట: నవజాత శిశువుల మరణాలు తగ్గించేందుకు అన్ని చర్యలు చేపట్టామని కేజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ డి.రాధాకృష్ణ తెలిపారు. కేజీహెచ్ పిల్లల వార్డులో జాతీయ నవజాత శిశువుల వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం స్టాఫ్ నర్సులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేజీహెచ్‌లో నవజాత శిశువులకు వైద్య సేవలు ఎంతో మెరుగుపడ్డాయన్నారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు మాట్లాడుతూ నవజాత శిశువులకు వైద్యసేవలు చాలా బాగా అందుతున్నాయని చెప్పారు. వైద్యులు, నర్సులు, అనుబంధ ఉద్యోగులందరూ సమష్టిగా కృషి చేయడం వల్ల సాధ్యపడిందన్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ జీవన్‌రాణి మాట్లాడుతూ నవజాత శిశువుల సంరక్షణ కోసం ప్రభుత్వం నుంచి కృషి జరుగుతోందన్నారు. స్టాఫ్ నర్సులకు, శిక్షణ విద్యార్థులకు వ్యాసరచన, గ్రూప్ చర్యలు తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. విజేతలకు, పోటీలో పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పిల్లల వైద్యురాలు డాక్టర్ రత్నకుమారి, డాక్టర్ చౌదరిబాబు తదితరులు పాల్గొన్నారు.

చోరీల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

సీతమ్మధార : చోరీల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని నగర క్రైం డీసీపీ లతా మాధురి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆమె గురువారం మధ్యాహ్నం ద్వారకా క్రైం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. స్టేషన్ పరిధిలో చోరీలు, చైన్‌స్నాచింగ్, బైక్‌ల చోరీ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిపై దృష్టి సారించాలని సూచించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. రాత్రి గస్తీ ముమ్మరం చేయడం ద్వారా చోరీలను సమర్థంగా అరికట్టవచ్చన్నారు. సీసీ కెమెరాల నిర్వహణను మెరుగుపరచాలన్నారు. కొత్త ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. చోరీ కేసుల్లో రికవరీ శాతం గణనీయంగా పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. చోరీలు జరిగే ప్రాంతాలను గుర్తించి, గస్తీ ముమ్మరం చేయాలని సూచించారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెంచాలని, వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేశారు. క్రైం ఏడీసీపీ మోహనరావు, సీఐ బంగారు పాప, ద్వారకా క్రైం ఎస్‌ఐ రాజు, ఏఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, ఇతర సిబ్బంది ఉన్నారు.



ద్వారకా పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న డీసీపీ లతామాధురి

కూటమి ప్రభుత్వంలో మత్స్యకారులకు అన్యాయం



మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు చేపను బహూకరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- మాజీ సీఎం జగన్ పాలనలో ఆర్థిక భరోసా
- ప్రస్తుత బడ్జెట్‌లో మొండి చేయి
- ప్రభుత్వ తీరుపై వాసుపల్లి ఆగ్రహం

డాబాగార్డెన్స్ : కూటమి ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మత్స్యకారులకు మొండి చేయి చూపించిందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ విశాఖ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మత్స్యకార దినోత్సవం సందర్భంగా ఆశీల్‌మెట్ట అశోక్‌నగర్‌లో గల కార్యాలయంలో గురువారం తనను కలిసిన గంగపుత్రులతో ఆయన మాట్లాడారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మత్స్యకారుల సంక్షేమానికి ఎంతో కృషి చేశారని, అన్నిరకాలుగా ఆదుకున్నారని గుర్తు చేశారు. ఫిషింగ్ హార్బర్‌లో ప్రమాదం చోటు చేసుకుంటే ఆగమేఘాలపై జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి, భారీ స్థాయిలో పరిహారం ప్రకటించారని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ పథకాలకు కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని మండిపడ్డారు. చంద్రబాబుకు మత్స్యకారులంటే చిన్న చూపని, బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. ఎన్నికల ముందు మత్స్యకారులకు ఇచ్చిన హామీలన్నీ చంద్రబాబు గంగలో కలిపేశారని, 100 కిలోమీటర్లకి ఒక జెట్టీ నిర్మిస్తామని చెప్పి గతంలో కూడా మోసం చేశారన్నారు. మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం కృషి చేయాలని, ప్రాణాలకు తెగించి సముద్రంలో వేట సాగిస్తున్న జాలర్ల సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్‌కు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు భారీ చేపను బహూకరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పీతల వాసు, దశమంతుల మాణిక్యాలరావు, తాడి రవితేజ, దొడ్డి బాపూ ఆనంద్, ముత్తాబత్తుల రమేష్, సూర్య, లింగం శ్రీను, దుర్గారావు, నర్సింగరావు, వేంకటేష్, లక్ష్మణ్, కె.సాగర్, రామరాజు, మైలిపిల్లి మసేను, గనగళ్ల గరకయ్య, ఆనంద్, రాజేష్, సనపల రవీంద్రభరత్, ముజీబ్‌ఖాన్, లండా రమణ, తదితరులు పాల్గొన్నారు.

గౌరమ్మకు వైభవంగా సారె సమర్పణ



గౌరీ మాతకు సారె తీసుకెళ్తున్న బంగారుమెట్ట మహిళలు

అల్లిపురం : వేంకటేశ్వరమెట్టపై శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలకు పలువురు భక్తులు గురువారం సారె సమర్పించారు. జీవీఎంసీ 33వ వార్డు బంగారుమెట్ట, శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం, శ్రీ గౌరీ మహిళా మండలి సభ్యులు సంయుక్తంగా అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు, మిఠాయిలు, కొబ్బరిబొండాలు, అరటి పండ్లు తదితర సారె తిరువీధి ఉత్సవం నిర్వహించి అందజేశారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల మధ్య అమ్మవారి సారెను బంగారుమెట్ట, నీలమ్మ వేప చెట్టు, గోవింద్ రోడ్డు, సింహాలదేవిడి మీదుగా తిరువీధి ద్వారా వెంకటేశ్వరమెట్టపై వెలసిన అమ్మవారికి అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ కార్యవర్గ సభ్యులు వారికి స్వాగతం పలికి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదం అందజేశారు.

మార్మోగిన శబరిగిరీశుని శరణుఘోష



వేంకటేశ్వరమెట్టపై అంబలం పూజలో పాల్గొన్న మాలధారులు, భక్తులు

అల్లిపురం : వేంకటేశ్వర మెట్టపై శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆవరణలో బుధవారం రాత్రి అయ్యప్ప అంబలం పూజ ఘనంగా నిర్వహించారు. అరటి డొప్పలు, కొబ్బరి పువ్వు, లేత కొబ్బరి ఆకులతో అంబళం కట్టిన గురుస్వాములు 18 మెట్లు ఏర్పాటు చేశారు. ముందుగా గణపతి పూజ, లక్ష్మీ పూజ అనంతరం అయ్యప్ప పూజ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరమెట్ట, బంగారుమెట్ట, సింహాల దేవిడి, గోవింద్ రోడ్డు తదితర ప్రాంతాల నుంచి స్వాములు పాల్గొని అయ్యప్ప భక్తి గీతాలు ఆలపించి ఉత్సాహపరిచారు. ఆ ప్రాంతమంతా శబరిగిరీశుని నామస్మరణతో, శరణుఘోషతో మార్మోగింది. పూజలో మాలధారులతోపాటు స్థానిక భక్తులు పాల్గొని ప్రసాదం స్వీకరించారు.

పక్కాగా ప్రజా ఫిర్యాదుల నమోదు



పీజీఆర్ఎస్ నమోదు కేంద్రంలో ఉద్యోగులకు ఆదేశాలిస్తున్న అదనపు కమిషనర్ రమణమూర్తి

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో ప్రతి సోమవారం ప్రజా వినతులు, ఫిర్యాదుల పూర్తి వివరాలతో క్లుప్తంగా నమోదు ప్రక్రియ జరగాలని అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి తెలిపారు. అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణతో కలిసి జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పీజీఆర్ఎస్ నమోదు కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజలకు అందించాల్సిన సేవలు, సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల్లో ఎటువంటి లోపాలు జరగకుండా ఉండేలా ప్రజల నుంచి నేరుగా వినతులు, ఫిర్యాదులను సంబంధిత విభాగాలకు చేరవేసేందుకు జీవీఎంసీలో 5 పీజీఆర్ఎస్ ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడమైందన్నారు. ఈ కేంద్రాల్లో ఉద్యోగులు ప్రజా వినతులు, ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు ప్రక్రియ జరపాలని ఆదేశించారు. అన్ని పనిదినాల్లో నమోదు ప్రక్రియ సూచించిన కార్యాలయం నుంచి జరపాలని, ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అధికంగా ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు వస్తాయని, ఉద్యోగులు సమయపాలనతో చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని సూచించారు. నమోదవుతున్న ఫిర్యాదులను అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు తెలుసుకుని పరిష్కరించేందుకు వీలుగా ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులు, వినతుల పరిష్కార వివరాలను నిర్ణీత కాలంలో ప్రజలకు తెలియపరిచేలా చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్లు, అధికారులు, ఉద్యోగులతో సమావేశం నిర్వహించి ఆదేశించామన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

డాబాగార్డెన్స్ : నగరంలోని 11 కేవీ విద్యుత్ హెచ్‌టీ లైన్‌కు మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్ – 1 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సింహాచలం నాయుడు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొబ్బరితోట, జెండా చెట్టు, అచ్చియ్యమ్మపేట, భూపేష్‌నగర్, అల్లిపురం, నేరెళ్లకోనేరు, కర్ణాలవీధి, రైల్వేస్టేషన్ రోడ్డు, అల్లిపురం సిగ్నల్ పాయింట్ ఏరియా, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



పోస్టర్లు ప్రదర్శిస్తున్న హార్బర్ ఏసీపీ కాళిదాసు, వన్‌టౌన్ సీఐ బాబు

అల్లిపురం: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చక్కగా చదువుకుని ఉన్నతంగా ఎదగాలని హార్బర్ ఏసీపీ ఎన్.కాళిదాసు ఆకాంక్షించారు. వన్‌టౌన్ థామ్సన్ స్ట్రీట్‌లోని మత్స్యకార సంక్షేమ సంఘంలో గురువారం యువతపై డ్రగ్స్, గంజాయి ప్రభావం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత తమ భవిష్యత్‌పై దృష్టి సారించాలని కోరారు. దేశ రక్షణలో యువత పాత్ర ముఖ్యమనదన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఫుట్‌బాల్ క్రీడాకారులకు ఏసీపీ కాళిదాసు మెడల్స్, కిట్స్ అందజేశారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ జీడీ బాబు తదితరులు పాల్గొన్నారు.